ప్రజాశక్తి
గురువారం 17 అక్టోబర్ 2024 5 కర్నూలు

ఎన్నికలు వాయిదా..!

- తాత్కాలికంగా సాగునీటి సంఘాల ఎన్నికలకు బ్రేక్ - త్వరలో మళ్లీ కొత్త షెడ్యూల్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉండగా ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 533 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటిలో కర్నూలు జిల్లాలో 284 సాగునీటి సంఘాలు, నంద్యాల జిల్లాలో 249 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ఎన్నికలకు మళ్లీ కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు..

రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా పలు కారణాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రక్రియను వాయిదా వేసింది. దీంతో బుధవారం వెలువడాల్సిన నోటిఫికేషన్ విడుదల కాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 533 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటిలో కర్నూలు జిల్లాలో 284 సాగునీటి సంఘాలు, నంద్యాల జిల్లాలో 249 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కెసి కెనాల్ కింద 2,65,624 ఎకరాల ఆయకట్టు ఉండగా 86 సాగునీటి సంఘాలు ఉన్నాయి. తుంగభద్ర ఎల్‌ఎల్‌సి కింద 1,51,134 ఎకరాల ఆయకట్టు ఉండగా 58 సాగునీటి సంఘాలు, గాజులదిన్నె ప్రాజెక్టు కింద 25,435 ఎకరాల ఆయకట్టు ఉండగా 12 సాగు నీటి సంఘాలు, రాంపురం ఛానల్ కింద 1,378 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒక సాగునీటి సంఘం ఉన్నాయి. కర్నూలు మైనర్ ఇరిగేషన్ కింద 21,623 ఎకరాల ఆయకట్టు ఉండగా 47 సాగునీటి సంఘాలు, నంద్యాల మైనర్ ఇరిగేషన్ కింద 29,756 ఎకరాల ఆయకట్టు ఉండగా 08 సాగునీటి సంఘాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో తెలుగు గంగ ప్రాజెక్టు కింద 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, కెసి కెనాల్ కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,592 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎస్సార్ బీసీ కింద 9 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,925 ఎకరాలకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 43,200 ఎకరాలకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. త్వరలో మళ్లీ కొత్త షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

కర్నూలులోని జలమండలి కార్యాలయం

మూడు దశల్లో ఎన్నికలు..

కొత్త షెడ్యూల్ విడుదల అయిన తరువాత మూడు దశల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి దశలో సాగు నీటి సంఘాలు (డబ్ల్యుయుఎ) ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ సంఘం పరిధిలోని ఆయకట్టు రైతులు ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. రెండో దశలో సాగు నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటాయి. ఈ ఎన్నికల్లో ఆయా ప్రాజెక్టుల ఇంజనీర్లతో పాటు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్‌డిఒ, సబ్ కలెక్టర్లు కీలక భూమిక పోషిస్తారు. ఎన్నికల నిర్వహణ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతాయి. తొమ్మిదేళ్ల తరువాత సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ ఈ కమిటీల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. పూడికతీత, పంట కాలువల ఆధునీకరణ, ప్రధాన కాలువల మరమ్మతులు తదితర పనులు రైతుల భాగస్వామ్యంతో నిర్వహిస్తారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు.. అధికారులు ముందస్తు చర్యలు కూడా చేపట్టాలని ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ , మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిన్నటి నుండి వర్షం కురుస్తోందన్నారు. ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం తక్కువగా ఉందని నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు. తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మండల స్పెషల్ ఆఫీసర్లు మండల కేంద్రాల్లో ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నది పరీవాహక ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చినా ఎదుర్కొనేలా అన్ని విధాల సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని డివిజన్ కేంద్రాలకు ఎన్‌డిఆర్‌ఎఫ్ టీములను పంపించామని కలెక్టర్ తెలిపారు. అధిక వర్షాలు కురవడం వల్ల ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు వచ్చే అవకాశం ఉంటుందని, అలాంటి ప్రాంతాలను తనిఖీ చేసి వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు బయటికి పంపాలన్నారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా గ్రామాల్లో డ్రైయిన్లను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో విఆర్‌ఒలు, విఆర్‌ఎల ద్వారా పరిస్థితిని పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైయిన్స్ సరిగ్గా ఉండకపోవడం వల్ల వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచి పోకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించాలని డిఇఒను ఆదేశించారు. ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలోని నదులు, వాగులు, వంకలు ఉన్న ప్రదేశాలను విజిట్ చేయాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలను ఆదేశించారు. పత్తికొండ, ఆదోని, ఆలూరు, సి.బెళగల్, చిప్పగిరి, మద్దికెర మండలాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయన్నారు. అప్రమత్తంగా ఉండాలని సంబంధిత మండలాల తహశీల్దార్లను ఆదేశించారు.

ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు

- నెరణికి చేరిన విగ్రహ మూర్తులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలసిన శ్రీమాల మల్లేశ్వర స్వామి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈనెల 7న కంకణ ధారణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 12న జైత్రయాత్ర (కర్రల సమరం), 14న రథోత్సవం, 16న గురవయ్య ఆట గొలుసు తెంపుట, వేదనసీల నృత్యాలు వంటి కార్యక్రమాలు జరిగాయి. వివిధ అవతారాల్లో పూజలందుకున్న శ్రీమాల మల్లేశ్వరులకు బుధవారం వసంతోత్సవంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహ మూర్తులను నెరణికి గ్రామానికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలు జరిగేందుకు ఏర్పాట్లు చేసి అందరి రక్షణ కోసం కృషి చేసిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎస్పీ బిందు మాధవ్, ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ బాల నరసింహులకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లకు సహకరించిన ఆయా శాఖల అధికారులు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేవరగట్టు నుంచి నెరణికి చేరుకున్న మాలమల్లేశ్వర స్వామి విగ్రహ మూర్తులు

చిరుజల్లులు

- జిల్లాను తాకిన అల్పపీడన ప్రభావం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

అల్పపీడన ద్రోణి ప్రభావం కర్నూలు జిల్లాను తాకింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా ఎడతెరపీ లేకుండా చిరుజల్లులు కురిశాయి. ఆదోనిలో ఒక మోస్తరు వర్షం కురిసింది. బుధవారం కోసిగి, పెద్దకడబూరు మినహా అన్ని మండలాల్లోనూ వర్షం కురిసింది. అత్యధికంగా ఆలూరులో 17.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కౌతాళం మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లా సరాసరిన 5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కర్నూలు నగరంలో వర్షం ధాటికి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచింది. పలు ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. రాజ్‌విహార్ కూడలి, బళ్లారి చౌరస్తా, వీకర్ సెక్షన్ కాలనీ, కృష్ణ నగర్, దేవనగర్, లక్ష్మినగర్, బిక్యాంపు, బిర్లాగేట్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు అధికంగా చేరింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం ప్రభావంతో బుధవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి జిల్లా అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

స్వేచ్ఛకు సంకెళ్లు వేసిన రాజ్యం

-ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

మేధావులను అక్రమంగా నిర్బంధించి, స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తూ కుట్ర పన్నుతున్న రాజ్యానికి వ్యతిరేకంగా మేధావులు కవులు కళాకారులు ఏకమై పోరాడాలని వక్తలు అన్నారు. ఇటీవల అస్తమించిన ఉద్యమ సూర్యుడు మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభనగరంలోని లలిత కళాసమితిలో బుధవారం నిర్వహించారు. కర్నూలు కవులు నిర్వహించిన సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారమోహన్ అధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సభకు హాజరైన ప్రజాభ్యుదయ సంస్థ నాయకులు భార్గవ మాట్లాడుతూ సాయిబాబా పేదలు, ఆదివాసీలు, స్థూలంగా మానవహక్కులకోసం పోరాడి అలసి సొలసి మనపై భాద్యత ఉంచి వెళ్ళారని, ఆయన ఆశయాన్ని కొనసాగించాల్సిన అవసరం ప్రగతిశీల వాదులపై ఉందన్నారు. దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందన్నారు. విరసం నాయకులు పాణి మాట్లాడుతూ సమాజం కొత్త దశకు చేరుకుంటున్న కాలంలో సాయిబాబా అర్థమౌతాడన్నారు. ఆయన జైలు గదిలో నేను చావును నిరాకరిస్తున్నాను అని రాశాడన్నారు. సాయిలోతైన కవిత్వం రాశాడన్నారు. అనేక పోరాటాలను కవిత్వంగా రాశాడాన్నారు. జైలులో ఆయనను బంధించవచ్చునుకుని రాజ్యం అనుకుంటే కానీ అతడు బయటకొచ్చి గొప్ప మానవుడుగా వచ్చాడన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ సాయిబాబా కవిగా, మేధావిగా కొత్త సమాజం కోసం కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్బంధం ఎదుర్కొని స్వేచ్ఛ లభించిందని అనుకుంటున్న సందర్భంలో అస్తమించడం దారుణమన్నారు. విరసం నాయకులు నాగేశ్వరాచారి మాట్లాడుతూ రాజ్యం చేసిన కుట్ర కు బలైన మేధావి సాయిబాబా అన్నారు. మేధావులను కోల్పోవడం దురదృష్ట కర పరిణామం అన్నారు. సభ ప్రారంభానికి ముందు నంది అవార్డు గ్రహీత మొహమ్మద్ మియా అభ్యుదయ గేయాలను పాడారు. సభకు సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఆహ్వానం పలికారు. కవులు రచయితలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఇనాయతుల్లా, మారుతీ పౌరోహితం, రత్నం యేసేపు, ఆద్యమెడికల్స్ అధినేత ఎవి రెడ్డి, జెవివి శేషాద్రిరెడ్డి, బీడీసుధీర్‌రాజు సాయిబాబకు నివాళు లు అర్పించారు.

ప్రొఫెసర్ సాయిబాబకు నివాళులర్పిస్తున్న జంధ్యాల రఘుబాబు, పాణి, కెంగార మోహన్

తడకనపల్లెలో 'పల్లె పండగ'

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం తలగనపల్లె గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రూ.21 లక్షలతో సిసి రోడ్లకు సర్పంచి సహెరాబీ భూమిపూజ చేశారు. కల్లూరు ఇఒఆర్‌డి నాగేష్, ఎఇపిఆర్ రవి మోహన్ రెడ్డి, ఎపిఒ మద్దేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్షావలి, విఆర్ఒ మున్నిసాబేగం, ఉప సర్పంచి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు హుస్సేన్, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షులు జుబేదాబి, తడకనపల్లె టిడిపి నాయకులు ఎస్ మహబూబ్‌బాషా, ఎస్.షఫీ, కోటేశ్వరయ్య, ఈశ్వరయ్య, రంగడు, నాగబజారు, జనసేన నాయకులు సలాం పాల్గొన్నారు.

తడకనపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచి సహెరాబీ

హెచ్‌ఆర్‌సి కార్యదర్శిగా చిరంజీవి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా జిల్లా రెవిన్యూ అధికారి చిరంజీవి బుధవారం హెచ్‌ఆర్‌సి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్చార్జి కార్యదర్శిగా వ్యవహరించిన పి.హనుమంత రెడ్డి నుంచి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌సి అధికారులు, ఉద్యోగులు హెచ్‌ఆర్‌సి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన టి.చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ ప్రజాపౌర సంబంధాల అధికారి పి. హనుమంత రెడ్డి , విభాగ అధికారులు జి.సునీత , బొగ్గరం తారక నరసింహ కుమార్ , ఎన్.సురేష్‌బాబు , నల్లమిల్లి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో మేటీగా నిలవాలి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించే రోలర్ స్కేటింగ్ పోటీలో కర్నూలు జిల్లాకు చెందిన స్కేటింగ్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరచి జిల్లాకు పేరు తేవాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ రోలర్ స్కేటింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను ఆయన ప్రకటించి వారిని అభినందించారు. ఎంపికైన వారు అక్టోబర్ 18 నుండి కాకినాడలో రాజాస్ ట్యాంక్‌లోని వైఎస్ఆర్ స్కేటింగ్ రింక్‌లో నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా రోలర్ స్కేటింగ్ ఉపాధ్యక్షులు పి.సునీల్ కుమార్, స్కేటింగ్ సంయుక్త కార్యదర్శి పునిత చౌదరి, కోశాధికారి అబూబాకార్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు: అండర్ 11లో సోయాల నింజిష , మాన్వి శ్రీ, హ్రితిక రెడ్డి, బాలురలో శ్రీతీక్ చౌదరి, ప్రిన్స్‌లియో, హితాక్ష్, అండర్ 14 లో సాహితీ, ఇక్షిత రెడ్డి, బాలురలో జయంత్ రెడ్డి, మొహమ్మద్ రయాన్, అండర్ 17 లో శామ్యూల్ రెనాల్డ్ ఉన్నారు.

పారిశుధ్యం లోపించకుండా పకడ్బందీ చర్యలు

కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. బుధవారం కృష్ణనగర్‌లో పలు వీధుల్లో కమిషనర్ పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. డెక్కన్ బిర్యానీ సెంటర్ సమీపంలో కల్వర్టు సామర్థ్యం తక్కువగా ఉండటంతో, మురుగు నీరు పక్కనున్న ఇళ్ళలోకి వస్తున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల్లో ప్రవాహానికి చెత్తాచెదారం ఆటంకం లేకుండా చూడాలని, రహదారులను పరిశుభ్రతంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. మురుగు, అపరిశుభ్ర వాతా వరణంతో వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దండు.లక్ష్మికాంత రెడ్డి, పారిశుధ్య తనిఖీదారుడు రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో పర్యటించిన కమిషనర్ రవీంద్రబాబు

ఆదిత్య నగర్ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

27వ వార్డు ఆదిత్యనగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు బుధవారం పర్యటించి కాలువలు కల్వర్టులు పరిశీలించి పరిష్కారానికి కృషి చెస్తామని హామీ ఇచ్చారు. ఆదిత్యనగర్ కాలనీలో కాలువలు, కల్వర్టు ఎత్తు పెంచి నిర్మించాలని గతంలో అనేక సార్లు వినతులు ఇచ్చినా సమస్య పరిష్కారం కానందున ఈనెల 15న సిపిఎం నాయకులు టి.రాముడు, పి నిర్మల, వి.భాస్కర్‌రెడ్డి కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. అందుకు స్పందించిన కమిషనర్ ఆదిత్యనగర్ కాలనీలో పర్యటించారు, సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చెస్తామని హామీ ఇచ్చారు. త్వరలో నిధులు విడుదల చేసి పనులు చేపడతామని హామినిచ్చారు. నేషనల్ హైవే సర్విసు రోడ్డు పైన ఉన్న కల్వర్టు వద్ద నుండి కల్లూరు వెళ్లే ప్రధాన రహదారి వెంట పర్యటించి కాలువలు పరిశీలించారు. కమిషనర్ వెంట కాలనీ నాయకులు ప్రసాద్ శర్మ, వి.భాస్కర్ రెడ్డి, సిపిఎం కృష్ణా , ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ATMA) వారి ఆధ్వర్యంలో కూరగాయల పంటల సాగులో మెలకులను రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ జిల్లా పిడి రత్న కుమార్ , ఏరువాక కేంద్రం సైంటిస్ట్ కిషోర్ కుమార్ , హార్టికల్చర్ ఆఫీసర్, వెటర్నరీ డాక్టర్, మండల వ్యవసాయ అధికారి , రైతు సేవ కేంద్రం సిబ్బంది, హనీఫ్‌బాష, రఫీ, సుకన్య, చక్రవర్తి నాయక్ , గ్రామ ఎంపిటిసి సందప్ప, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఆత్మ పిడి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలను సిబ్బందిని ఉపయోగించుకోవాలన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా మంచి సలహాలు సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. మండలంలోని రైతులు టోల్ ఫ్రీ నెంబర్ను 155251 వినియోగించుకోవాలన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు కొత్త రకమైన వంగడాలను ,ఎక్కువ దిగుబడి సాధిస్తున్న రైతులను మన జిల్లా నుంచి తీసుకెళ్లి వారి దగ్గర చూపిస్తామన్నారు. ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ కూరగాయలు .పండ్ల తోటల పెంపకంలో పాలకుర్తి ముందు అడుగులో ఉన్నదని, ఇంకా మంచి దిగుబడులు తీయాలని, దానికి అవసరమైన సలహాలు సూచనలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ టీకాలను పశువులలో, గొర్రెలలో సీజన్‌కు ముందు తప్పనిసరి వేయించుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు రబీలో వేస్తున్న సెనగ పంట, వేరుశనగ పంటకు విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాణెమ్మ

మున్సిపల్ టీచర్లకు అవకాశమివ్వాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఎన్‌సిఇఆర్‌టిలో డిప్యూటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీ లో అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా ఈ పోస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు ఓ ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ఎన్‌సిఇఆర్‌టిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ నోటిఫికేషన్‌లో గవర్నమెంట్ జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు అర్హులని చెప్పారని, కానీ మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా పాఠశాల పరిధిలోకి తీసుకొచ్చిన విషయాన్ని ఈ నోటిఫికేషన్‌లో మరిచారని విమర్శించారు. 010 హెడ్ కింద జీతాలు తీసుకునేవారని ఒక వైపు చెబుతూనే, మరొకవైపు మున్సిపల్ ఉపాధ్యాయులను మినహాయించడం సరికాదన్నారు. అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా ఈ పోస్టులకు ఇస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

డివిజన్ స్థాయిలో విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్స్

ఎస్ఇ ఎం.ఉమాపతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పోరేషన్

తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వుండాలని కర్నూలు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం. ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ఎపిఎస్‌పిడిసిఎల్,తిరుపతి వారి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా పరిధిలోని కర్నూల్ టౌన్, ఆదోని ఎమ్మిగనూరు డివిజన్‌ల పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు డివిజన్స్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో వుండాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేయడం ఏమనగా వర్షాల వలన కలిగే విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

భద్రత నియమాలు: వర్షాలు,గాలులు ఎక్కువగా వస్తున్నప్పుడు లేదా నీటి నిలువ ఎక్కువగా ఉన్న చోట కరెంటు స్తంభాలను తాకరాదు , వాటి దగ్గర ఉండరాదు. ఇంట్లో నిమ్ముగా ఉన్న లేదా తడిచిన స్విచ్ బోర్డ్‌లను చేతులతో తాకకుండా పొడిగా ఉన్న కర్రపుల్ల ద్వారా లేదా ప్లాస్టిక్ వస్తువుల ద్వారా స్విచ్ లను వేసుకోవాలి. కరెంటు వస్తువులను చేతులతో తాకరాదు. రైతులు వారి విద్యుత్ మోటార్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. ఎక్కడైనా కరెంటు లైన్లు తెగి పడిన, స్తంభాలు విరిగి పడిన సంబంధిత లైను మెన్‌కు, సంబంధిత సబ్ స్టేషన్‌కు కంట్రోల్ రూమ్‌లకు వెంటనే తెలియ జేయాలి. విద్యుత్ సమస్యల ఫిర్యాదు టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా 1800425155333 కు కాల్ చేసి సమాచారం అందించాలి. సంస్థ వాట్సాప్ నంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు

కర్నూలు: 7382614308, కర్నూలు డివిజన్ : 08518-221919, ఎమ్మిగనూరు డివిజన్ : 7382787703, ఆదోని డివిజన్ : 7382614098

పల్లె పండుగతో అభివృద్ధి

ప్రజాశక్తి- సి బెళగల్: పల్లె పండుగతో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ఎంపిడిఒ రాణెమ్మ పేర్కొన్నారు. బుధవారం పోలకల్, ముడుమాల గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మండలానికి రెండు కోట్లు మంజూరు అయ్యాయని సిసి రోడ్లు, గోకులం సెడ్లు,పొలంలో నీటికుంటలు, పండ్ల తోటలు వంటివాటికి కూడా ఉపయోగించు కోవచ్చని తెలిపారు.ఎపిఒ రామన్న, జెఇ రంగస్వామి పాల్గొన్నారు.

ముగిసిన దస్తగిరయ్య స్వామి కిస్తీ ఉత్సవాలు

సి బెళగల్ : సి బెళగల్‌లో దస్తగిరయ్య ఉరుసు సందర్భంగా ఆలయ పెద్దలు బుధవారం కిస్తీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు గంధం మొదలు కొని భక్తులు అధిక మొత్తంలో చేరుకొని మొక్కులు తీర్చుకొన్నారు. వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం, తాగు నీటి సౌకర్యాలు వంటివి కల్పించి కిస్తీతో ముగించారు.

లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

వార్డుల్లో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్, కమిషనర్

పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తితే సమాచారం ఇవ్వాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ కోరారు. బుధవారం ఆదోనిలోని హనుమాన్ నగర్ ప్రాంతంలో తహశీల్దార్ శివరామ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుఫాను తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని వంక సమీపంలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణంలో హనుమాన్ నగర్, వడ్డేగేరి, కునిమహల్, ఆవు దూడ వంక, శ్రీనివాస్ భవన్ ప్రాంతం, రైతు మార్కెట్ ప్రాంతాలను లోతట్టుగా గుర్తించామని చెప్పారు. రాత్రి వేళలో భారీ వర్షం కురిస్తే ఇళ్లల్లోకి నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేశామన్నారు. తుఫాను ప్రభావం నేటి వరకు ఉండవచ్చని తెలిపారు. ఏవైనా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్ 08512 -295468కు సమాచారం ఇచ్చి అత్యవసర సేవలు పొందాలని సూచించారు. కాలువలో పూడికను తొలగించి నీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెత్తాచెదారం కాలువలో వేయరాదని సూచించారు. మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, డిప్యూటీ ఇంజినీర్లు గోపీనాథ్, రామ్మూర్తి ఉన్నారు.

గోవిందమ్మ దీక్షకు దిగొచ్చిన యంత్రాంగం

- దీక్షను విరమింపజేసిన అధికారులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిమ్మరసం అందిస్తున్న అధికారులు

పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మ దీక్షకు అధికారులు దిగి వచ్చారు. గోవిందమ్మపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని జిల్లా అధికారుల నుంచి హామీ రావడంతో బుధవారం దీక్ష విరమించారు. మంగళవారం పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో ఎస్పీ బిందు మాధవ్ బాధితురాలు గోవిందమ్మను పరామర్శించి, ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఘటన గురించి ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. తనకు న్యాయం చేసి నిందితులను అరెస్టు చేయాలని గోవిందమ్మ ఎస్పీతో వాపోయారు. ఆయన పూర్తిస్థాయి హామీని ఇచ్చారు. దీక్షను టౌన్ సిఐ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వీరభద్ర గౌడ్ విరమింపజేశారు. బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్, ఎఐసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంచాల లక్ష్మీనారాయణ, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి.రంగయ్య, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షులు కదిరికోట బతుకమ్మ, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ డివిజన్ అధ్యక్షులు సుమాల ఛార్లెస్, మాల మహానాడు నాయకులు మధుబాబు, నరసప్ప, మాల హుస్సేని, ఐఎఫ్‌టియు నాయకులు చిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

పచ్చని పైరును కాటేసిన కసాయిలు....

ప్రజాశక్తి - ఆలూరు

పొలంలో విలపిస్తున్న బాధితురాలు

వ్యక్తిగత ద్వేషం పెంచుకున్న కసాయిలు పచ్చని పైరును కాటేసిన సంఘటన బుధవారం హులేబీడు గ్రామ రెవెన్యూ పరిధిలో చోటు చేసుకుంది. మనేకుర్తి గ్రామానికి చెందిన అగ్రహారం ఎల్లమ్మకు సర్వే నెంబరు 174/డి, ఖాతా నెంబరు 216లో 9.82 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టి బిస్కట్ జొన్న పంట సాగు చేశారు. పైరు పచ్చగా బాగున్న తరుణంలో కసాయిల కంట పడింది. రెండు రోజుల క్రితం గడ్డి మందు పిచికారి చేసి పంటను నాశనం చేశారని బాధితురాలు వాపోయారు. తన కొడుకులే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన : పట్టణ శివారు ప్రాంతంలో గుడెకల్లు రోడ్డులో ఫిల్టర్ బెడ్‌ను కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ తాగునీటి నిల్వలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిఇ నీరజా, ఎఇ శరత్ చంద్ర పాల్గొన్నారు.

మాటల్లోనే మహిళా సాధికారత

- మండల సర్వసభ్య సమావేశానికి భార్యల స్థానంలో భర్తలు హాజరు

- పార్టీలో చేరండి.. పనులు చేసుకోండి... - ఎమ్మెల్యే పార్థసారథి 'ఆఫర్'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహిళా సాధికారత మాటల్లోనే కానీ చేతల్లో కనిపించడం లేదు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి భార్యల స్థానంలో భర్తలు హాజరయ్యారు. ఎమ్మెల్యే హాజరైన మండల సర్వసభ్య సమావేశానికి మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలు హాజరుకావడం విమర్శలకు తావిస్తోంది. జాలమంచి సర్పంచి తిక్కమ్మకు బదులు ఆమె భర్త గోవిందు, కొత్తూరు సర్పంచి మహానందమ్మకు బదులు ఆమె భర్త నాగరాజ్, దిబ్బనకల్ సర్పంచి లక్ష్మికి బదులు ఆమె భర్త లక్ష్మన్న హాజరయ్యారు. సమావేశంలో భార్యల తరపున సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచులుగా ఎన్నికైన భార్యలకు పాలన వ్యవహారాల్లో ఓ మాదిరి సహ కారం భర్తల నుంచి ఉంటే ఫర్వాలేదు. కానీ వారిని పూర్తిగా పక్కనపెట్టి ముఖ్యమైన సమావేశాల్లో భర్తలు హాజరు కావడంపై విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో పెత్తనమంతా సర్పంచుల భర్తలే చెలాయిస్తారన్నది బహిరంగ రహస్యం. ఈ ధోరణి మారి మహిళలు వారి సంపూర్ణ రాజకీయ అధికారాలు, హక్కులను పొందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలను వివరిస్తున్న సర్పంచి భర్త లక్ష్మన్న

'వచ్చామా.. వెళ్లామా..?

మండల సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టారు. ఆదోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి బడాయి దానమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. ఎక్కువమంది అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. అధికారులు సమయపాలన లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్యాహ్నం 1 గంట అయినా సమావేశానికి హాజరు కాలేదు. సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమస్యలకు పరిష్కారం, అధికారుల పనితీరు గురించి చర్చించాల్సిన ప్రజాప్రతినిధులే హాజరు కాకపోవడంలో ఆంతర్యం ఏమిటో అధికారులు తేల్చాల్సి ఉంది. సమావేశంలో ప్రతి శాఖ నుంచి హాజరై నివేదికలను వివరించాల్సిన అధికారులు 'వచ్చామా.. వెళ్లామా' అన్నట్లుగా వెంట తెచ్చుకున్న సమాచారాన్ని చదివి వెళ్లారు. సమస్యలను ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరించాల ని కొంతమంది సర్పంచులు కోరారు. చిన్న పెండేకల్ ఎంపిటిసి సరోజమ్మ మాట్లాడుతూ... 11 నెలలు అవుతున్నా ఎంపిటిసికి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాండవగల్ సర్పంచి ఉమాదేవి మాట్లాడుతూ... సర్పంచుల గౌరవ వేతనాలు పెంచేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. గ్రామంలో 2012 నుంచి 2019 వరకు మధ్యలో ఆగిపోయిన ఎన్‌టిఆర్ గృహకల్ప విషయంలో ప్రజాప్రతినిధులకు తెలియకుండా గ్రామంలో జియోటాగ్ చేసి వెళ్లిపోతున్నారని సర్పంచులు వరదప్ప, రామాంజనేయులు తెలిపారు.

పార్టీలో చేరండి.. పనులు చేసుకోండి - ఎమ్మెల్యే పార్థసారథి

మండల సర్వసభ్య సమావేశం అనంతరం సర్పంచులు లోకేష్, ప్రహ్లాద్ యాదవ్, మహాదేవ, వరదప్ప, రాజశేఖర్, మహిళా సర్పంచులు ఉప్పర జయమ్మ, ధనలక్ష్మి, శివమ్మతో పాటు మరికొందరు ఎమ్మెల్యేతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా గ్రామాల అభివృద్ధి పనులు సర్పంచులకే అప్పజెప్పాలని ఎమ్మెల్యేను కోరారు. సర్పంచుల పదవి కాలం 15 నెలలు ఉందని, తమకు కూడా గత ప్రభుత్వం ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి చేయలేకపోయామని, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వమైనా పనులు చేసేందుకు అవకాశం కల్పిస్తే పనులు చేసి గ్రామానికి మంచి పేరు తెచ్చుకుంటామని కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... 'బిజెపిలో చేరి పనులు చేసుకోండి' అంటూ నవ్వుతూ చెప్పడంతో కొద్దిసేపు సర్పంచులు నవ్వుకున్నారు. మరికొందరు స్పందిస్తూ... రాబోయే కాలంలో గ్రామానికి మంచి జరిగితే రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచిస్తామని సర్పంచులు తెలిపారు.

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

అక్కడ మద్యం దుకాణం వద్దు

- మున్సిపల్ ఛైర్మన్‌కు మహిళల వినతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలు నెలకొల్పుతున్నారని, నిబంధనలు పాటించేలా చూడాలని మహిళలు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంతకు మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు రాజేశ్వరి, జయ జైన్, రేఖ జైన్, శ్యామల మాట్లాడారు. పట్టణంలోని ప్రభాకర్ టాకీస్ రోడ్డులో పురాతన శివాలయం ఉందని తెలిపారు. సమీపంలో వైన్‌షాపు ఏర్పాటు వద్దంటూ వేడుకుంటున్నా పట్టించుకోకుండా ఏర్పాట్లు చేస్తున్నారని, సమంజసం కాదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. శివ స్వాములు అక్కడే దీక్ష తీసుకోవడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. సోమ, శనివారం ఆలయంలో పూజలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. వైన్ షాపు ఏర్పాటు చేసే ప్రాంతంలో నివాసాలు ఉన్నాయన్నారు. గుడికి, బడికి 100 మీటర్ల దూరంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నా ఎక్సైజ్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలు కావడం లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటుతో ఆకతాయిలు మద్యం తాగి వికృత చేష్టలకు పాల్పడడం వల్ల ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ముందుగానే సమాచారం ఇస్తున్నామని, అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, డీఎస్పీ, ఎక్సైజ్ సిఐకి వినతిపత్రం ఇస్తామన్నారు. అప్పటికీ స్పందించకపోతే రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడతామని హెచ్చరించారు. ఛైర్మన్ శాంత స్పందిస్తూ... మహిళలు ఇబ్బంది పడే చోట మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ఎక్సైజ్ సిఐ సైదుల్‌కు సమాచారం ఇచ్చారు. సమీపంలో గుడి ఉందని, నివాసాలు ఉన్నాయని, పరిశీలించాలని ఫోన్ ద్వారా తెలిపారు. సిఐ సైదుల్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఛైర్మన్ శాంత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ పరిధిలో గుడి ఉంటేనే నిబంధన వర్తిస్తుందని సిఐ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు ఛైర్మన్ తెలిపారు. మహిళలు తలచుకుంటే మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని, అవసరం అనుకుంటే వారికి మద్దతుగా రోడ్డులో దీక్ష చేపడతామని హెచ్చరించారు. అధికారులు స్పందించి అభ్యంతరం ఉన్నచోట కాకుండా మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు మహిళలు వినతిపత్రం ఇచ్చారు.

మున్సిపల్ ఛైర్మన్ శాంతకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

వాల్మీకి మహర్షి చరిత్ర అందరికీ తెలియాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

- వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - చిప్పగిరి

వాల్మీకి మహర్షి చరిత్ర అందరికీ తెలిసి ఉండాలని, భావితరాలకు కూడా వాల్మీకి మహర్షి అంటే చెప్పగలిగే స్థితిలో ఉండాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, ఎంపిపి జూటూరు హేమలత, సర్పంచి నీలకంఠ, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ మల్లికార్జున తెలిపారు. బుధవారం దేగలపాడు గ్రామంలో సర్పంచి నీలకంఠ, గ్రామ పెద్దలు పోతన, జూటూరు లింగన్న, ఓలయ్య, నారాయణస్వామి, లాలూ స్వామి, ధనుంజయ ఆధ్వర్యంలో వేకువ జామునే వేద పండితుల చేత ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ప్రతిష్టాపనకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విరుపాక్షి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే విరుపాక్షికి సర్పంచి నీలకంఠ అధ్యక్షతన గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికి, పూలమాల, శాలువాతో సన్మానించారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి, గ్రామ పెద్దలు

వాల్మీకి మహర్షి ప్రతిష్టాపనకు వివిధ మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

విరుపాక్షికి సన్మానం : ఎమ్మెల్యే విరుపాక్షి మండల కార్యాలయంలోకి వచ్చిన నేపథ్యంలో నూతనంగా వచ్చిన ఎంపిడిఒ అల్లాప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోదామని అధికారులకు సూచించారు. ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఓ జాబర్ అహ్మద్, శ్రీనివాసులు, శ్రీరాములు, ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

నీరు బయటికి వెళ్లేలా చర్యలు

- ఎడిఎ సునీత

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాల నుంచి పంటలను కాపాడుకొనేందుకు రైతులు పొలాల్లో నిలిచిన నీటిని బయటికి వెళ్లే ఏర్పాటు చేసుకోవాలని ఆలూరు ఎడిఎ సునీత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలను కాపాడుకొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కంది పంట పూత దశలో ఉన్నందున ముందుగా పొలంలో ఆగి ఉన్న నీటి బయటికి పంపించాలని తెలిపారు. వర్షం తగ్గిన తర్వాత కంది పంటలో బూస్టర్ డోస్‌గా ఒక ఎకరాకు 20 కిలోల యూరియా చల్లాలని చెప్పారు. రైతులు శనగ విత్తనం వేయక పోతే వారంరోజుల తర్వాత విత్తనం వేసుకోవాలని తెలిపారు. శనగ విత్తనం విత్తి మొలకెత్తిన పొలంలో నీరు నిలిచి ఉంటే బయటికి పంపించే ఏర్పాటు చేయాలని సూచించారు. వారం తర్వాత ఒక శాతం 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయాలని తెలిపారు. వేరు కుళ్లు నివారణకు ఒక లీటరు నీటికి 3 గ్రాముల ఆక్సి క్లోరైడ్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తి పంట మొదటి దశ నుంచి మూడో దశలో ఉన్నందున పొలంలో నీరు ఆగి ఉంటే బయటికి పంపే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే ఒక లీటరు నీటిలో 20 గ్రాముల యూరియా లేదా ఫార్ములా-4ను ఒక లీటరు నీటిలో 5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. కొర్ర, సద్ద పంట కోత దశలో ఉన్నందున కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

సూక్ష్మపోషకాల ఆవశ్యకత తెలుసుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి - మంత్రాలయం

సూక్ష్మ పోషకాల ఆవశ్యకత గురించి రైతులు తెలుసుకోవాలని ఎడిఎ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని కలుదేవకుంట గ్రామంలో ఎడిఎ, ఎఒ శశిధర్ రెడ్డి, ఎఒ జీరా గణేష్ ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ... తుఫాను వల్ల నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పంటల మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మండలంలోని సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.

'వైద్య కళాశాల పనులు ప్రారంభించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆదోనిలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం జెఎసి కన్వీనర్ శ్రీనివాసులు, సోమశేఖర్, వీరేష్, ఉదయ్, శశి, మాట్లాడారు. వైద్య కళాశాల పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన అడ్మిషన్లు నిలిచిపోయాయని తెలిపారు. పనులు పూర్తయితే పశ్చిమ ప్రాంత నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులను ప్రారంభించాలని కోరారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

అనాథ వృద్ధునికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అనాథ వృద్ధుని మృతదేహానికి పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ వారు అనాథ వృద్ధుని చేరదీసి సేవలందించారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు అందించినప్పటికీ కోలుకోలేక బుధవారం వేకువజామున మృతి చెందారు. సొసైటీ సభ్యులు సింగనేటి నరసన్న, సాతర్ల ప్రసాద్‌లు పట్టణ సిఐకి, మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించారు. చట్టపరంగా అనాథ మృతదేహాల అంత్యక్రియల విషయంలో ఏం చేయాలో తెలుసుకుని రాతపూర్వకంగా వివరాలు తీసుకున్నారు. మానవతవాదులు, సామాజిక సేవకులు యు.రాము, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ డాక్టర్ కామళే గణేష్, బీసీ.బతుకన్న, రామకృష్ణ, పోలీసులు, మున్సిపాలిటి వారు అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 13న మండలంలోని కులుమాల గ్రామంలో హత్యకు గురైన కురువ కృష్ణవేణి (27) కేసులో నిందితుడు, మృతురాలి భర్త కురువ పక్కిర్ అలియాస్ పక్కీరప్పను అరెస్టు చేసినట్లు గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... కృష్ణవేణి హత్య కేసులో మృతురాలి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కేసులో నిందితుడు, మృతురాలి భర్త కురువ పక్కీరప్పను బుధవారం కులుమాల నుంచి చిన్నమరివీడు రోడ్డులోని నల్లపోచమ్మ గుడి దగ్గర అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

నిందితుని చూపుతున్న సిఐ

కూటమితోనే గ్రామాలాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోనిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం మండలంలోని హానవాళ్ గ్రామంలో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించారు. 'పల్లె పండగ'లో భాగంగా ఆయా గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. **కౌతాళం** మండలంలోని గుడికంబాళి గ్రామంలో సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు మాట్లాడారు. పల్లె బాగుంటేనే దేశం బాగుంటుందని భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'పల్లె పండగ'కు శ్రీకారం చుట్టారని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు అడివప్ప గౌడ్, చిన్న సిద్ధయ్య, సుబ్రమణ్య రాజు, నాగేశ్వరావు, బిజెపి నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, జనసేన నాయకులు రామాంజినేయులు, టిడిపి యువ నాయకులు సతీష్ నాయుడు, సురేష్ నాయుడు, గ్రామ నాయకులు మల్లప్ప గౌడ్, మాజీ సర్పంచి గోపాల్, రెనప్ప, దేవన్న, అంపయ్య, శ్రీనివాస్, రిషి, ఖాజా, హజరత్, మారేష్, రిషి, రమేష్, శరణ, నాయకులు సిద్ధన్న గౌడ్, లక్కే గోవిందు, శివమూర్తి, రోహిత్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని సూగూరు, చెట్నిహల్లి, సింగరాజనహల్లి, పరమాన్‌దొడ్డి గ్రామాల్లో 'పల్లె పండగ'లో భాగంగా సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. సూగూరు గ్రామంలో రూ.5 లక్షలతో 2 రోడ్లకు, చెట్నిహల్లిలో రూ.10 లక్షలతో ఒక రోడ్డు, సింగరాజన్న హళ్లిలో, పరమాన్ దొడ్డిలో రూ.3 లక్షల చొప్పున రెండు రోడ్లకు భూమిపూజ చేశారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న మాధవరం మాజీ సర్పంచి, టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డికి, నాయకులకు డప్పు వాయిద్యాలతో పూలమాలలు వేసి స్వాగతం పలికారు. మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, చేపల నాగేష్, మేకల మల్లేష్, పూజారి మల్లేష్, చాకలి నరసింహులు, వీరేష్, పరమేష్, గోపాల్, పెద్ద లక్ష్మయ్య, వెంకటరాముడు, ఎంపిడిఓ శోభారాణి, ఎపిఓ తిమ్మారెడ్డి, పంచాయతీ రాజ్ మల్లయ్య, ఇఓఆర్‌డి ప్రభావతి పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలోని కామినహాల్ గ్రామంలో 'పల్లె పండగ' నిర్వహించారు. ఎంపిడిఓ వరలక్ష్మి, టిడిపి నాయకులు రమేష్, కృష్ణమ నాయుడు, నాగరాజు పాల్గొన్నారు. **చిప్పగిరిలో** ఉపాధి హామీ నిధులు రూ.60 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను భూమిపూజ చేసినట్లు సర్పంచి దాసరి గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపిటిసి రజిని, టిడిపి నాయకులు జనార్ధనస్వామి, పోతురాజు రాముడు, బోగేష్, జనసేన మండల అధ్యక్షులు చిరంజీవి, ఎంపిడిఓ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఎపిఓ జాబర్ అహ్మద్, రెవెన్యూ కార్యదర్శి గోవిందన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి పాల్గొన్నారు.


మంత్రాలయంలో భూమిపూజ చేస్తున్న నాయకులు

కౌతాళంలో భూమిపూజ చేస్తున్న నాయకులు

చిప్పగిరిలో భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

బస్సుల కోసం పడిగాపులు

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బస్సుల కోసం ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దసరా సెలవులు పూర్తయి మూడు రోజులు కావస్తున్నా ప్రజలు గమ్యస్థానాలకు చేరడానికి బస్టాండ్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. హైటెక్, లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఏదైనా సరే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది. రెండింతలకు పైగానే జనం బస్సు ఎక్కితే కూడా బస్టాండ్‌లో భారీ జనం కనిపిస్తున్నారు. ఏ బస్సు వచ్చినా ఆ బస్సు దగ్గరకు పరుగులు తీస్తున్నారు. జనాభా పెరిగినా ఆ స్థాయిలో ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు అరకొరగా రద్దీ ఉన్న రూట్లకు బస్సులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. రద్దీకి తగిన బస్సు వేయడంలో ఆర్‌టిసి అధికారులు కూడా విఫలం చెందారు.

బస్సుల కోసం వేచి ఉన్న ప్రజలు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాలాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ కాలనీలో రూ.15 లక్షలతో సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ప్రజల కోసం తమ ఇంటి తలుపులు ఎప్పుడు తెరుచుకుని ఉంటాయన్నారు. అంతకుముందు కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్, కనకదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వైఎస్ఆర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మిస్తున్నందుకు కాలనీ వాసులు సన్మానించారు. ఎంపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబుసాబు, సర్పంచి పాల్ దినకరన్, ఏకం రెడ్డి, రామన్నగౌడ్, గురునాథ్ రెడ్డి, హాల్వి చెన్నప్ప, పాండురంగా రెడ్డి, నర్సారెడ్డి, సోమిరెడ్డి, అనిల్ కుమార్, బుచ్చయ్య, మహేష్, అవతారం, సమ్మద్, తిక్కయ్య, ఈశప్ప, శివరాం పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న నాయకులు

మద్యం దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్లు, దేవనకొండ గ్రామాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో నూతన మద్యం దుకాణాలను బుధవారం ప్రారంభించారు. లాటరీ పద్ధతిలో దేవనకొండ 91వ వారాహి మద్యం షాపును కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన వెంకటప్ప నాయుడు కోడలు రమ, 92 భవ్య మద్యం దుకాణం పలుకూరబండ గ్రామానికి చెందిన బోయ మల్లేష్ దక్కించుకున్నారు. వారి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, వెలమకూరు సర్పంచి భాస్కర్, కప్పట్రాళ్ల సర్పంచి చెన్నమనాయుడు, పాప నాయుడు ప్రారంభించారు. టిడిపి నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, వెంకట స్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, రాజగోపాల్ గౌడ్, పి.కోటకొండ మల్లెపల్లి రంగడు, చిట్యాల రామాంజనేయులు, ముని పాల్గొన్నారు.

NAME CHANGE

Indumuri Somanath residing at H.No. 17/837/28 , Kranthi Nagar, Adoni, Kurnool dist 518301.A.P that my son Indumuri Maneesh (old Name) changed his Name as Indumuri Maneesh Mourya (new name)

IN THE COURT OF THE CIVIL JUDGE II ADDITIONAL (JUNIOR DIVISION): ADONI.
O.S.No.63/2023.

Between:
City Union Bank Ltd.,
Adoni Branch, rep. by its Branch Manager.
...Plaintiff.
V/s
1. M/s. Hare Rama Hare Krishna Bakery and Sweet Stall, Prop: V.Yallappa, and another
...Defendants.

SUMMONS TO DEFENDANTS. No.1.To D.3.

To
D.1. M/s.Hare Rama Hare Krishna Bakery and Sweet Stall, rep by its Prop: V.Yallappa, S/o. Venkoba, Door.No.5-630, Satyanarayana pet, Adoni, Kurnool-Dt.,
D.2. V.Yallappa, S/o. Venkoba, Door. No.5-630, Satyanarayana pet, Adoni, Kurnool-Dt.,
D.3. V.Jayalakshmi, W/o.V.Yallappa, Door.No.5-630, Satyanarayana pet, Adoni, Kurnool-Dt.,

Whereas the above named Plaintiff filed a suit for recovery of loan amount availed by defendants towards business purpose under credit facility for the purpose of running Bakery and Sweet Stall. Hence take the summons, if you have got any objection for the above said suit, you may appear before this Hon'ble Court on 06.11.2024, at 10.30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the suit will be decided ex-parte.

// BY ORDER OF THE COURT //
V.SRIRAMULU,
B.Com., LL.B., (Spl).,
ADVOCATE FOR PLAINTIFF
ADONI.
Cell.No.9440244475.

IN THE COURT OF THE CIVIL JUDGE II ADDITIONAL (JUNIOR DIVISION): ADONI.
I.A.No.247/2019 in O.S.No. 161/2012.

Between:
S.Kiran Babu. ...Petitioner/Plaintiff.
V/s
1. K. Pedda Roshanna
2. S. Jeeviteshwar (Died by L.R.S 4 to 6)
3. M. Raja Sekhar,
4. S. Aruna Kaumari,
5. S. Mythli,
6. S. Krishna Sandeep.
...Respondents/Defendants

NOTICE TO RESPONDANTS. No's. (4 to 6.)

To
R.4. S. Aruna Kaumari, W/o. Late S. Jeviteshwar,
R.5. S. Mythli, D/o. Late S. Jeviteshwar,
R.6. S. Krishna Sandeep, S/o, Late S. Jeviteshwar,
R.4 to R.6 all are R/o.H.No.65/83A, Old Bus Stand, Fort, Kurnool.

WHEREAS the above named Petitioner has filed petition U/o.9 Rule 9 and Sec.151 of C.P.C, to Restoration of above suit, hence filed petition U/Sec-5 of Limitation Act to condone the delay of 10 days in filing the petition. Hence take the Notices, if you have got any objection for the above Petition, you may appear before this Hon'ble Court on 12.11.2024, at 10.30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the Petition will be decided ex- parte.

// BY ORDER OF THE COURT //
V.SRIRAMULU,
B.Com., LL.B., (Spl).,
ADVOCATE FOR PETITIONER
ADONI.

ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందించండి : ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

సిరివెళ్ల మండల పరిధిలో అయా గ్రామాలలో ప్రజల నుండి వచ్చే ప్రజా సమస్యలపై గ్రామస్థాయి అధికారులు తక్షణమే స్పందించాలని శిరివెళ్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ కాలువల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి ఎద్దడి నివారణ, తదితర అంశాల పట్ల నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. వర్షాల కారణంగా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ కాలువలలో నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షకులుగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పుష్ప కుమారి, ఇఓపిఆర్డి వర్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పాణ్యం

ఈ నెల 13న గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన జార్జ్ తన ముగ్గురు భార్యలతో కలిసి కర్నూల్‌కు వెళ్ళే దారిలో చందమామ హోటల్‌కు దగ్గరలో వున్న ఎస్ఆర్‌బిసి కాలువలో సరదాగా స్నానం చేస్తుండగా వెన్నెల(18) కాలువలో కొట్టుకుపోయింది. పాణ్యం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో ప్రవాహం అధికంగా ఉండటంతో గాలింపునకు ఆటంకం కలిగింది. బుధవారం బనగానపల్లెలోని రవ్వలకొండ సమీపాన మహిళ మృతదేహం లభ్యమయినట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా వుందని, ఎవరూ ఈతకు వెళ్లరాదని ప్రజలకు సూచించారు.

ఎరువుల దుకాణంలో చోరీకి యత్నం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని మాచినేనిపల్లి గ్రామ సమీపంలో ఉన్న విజయలక్ష్మి ఏజెన్సీ రసాయనిక పురుగు మందుల దుకాణంలో చోరీయత్నం జరిగింది. బుధవారం విజయలక్ష్మి ఏజెన్సీ పురుగుమందుల దుకాణం యజమాని గోపాల్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి తెల్లవారు జామున 4:30 నిమిషాల సమయంలో మాచినేని పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రసాయనిక ఎరువుల దుకాణం దగ్గరకు వచ్చి తాళాలను పగలగొట్టేందుకు పెద్ద రాయితో ప్రయత్నించి ఎంతకు పగలకపోవడంతో ప్రయత్నం విరమించినట్లు తెలిపారు. చోరీ చేసే సమయంలో దుకాణానికి ఉన్న సీసీ కెమెరాలు పక్కకు జరిపి చోరీయత్నం చేశారన్నారు. అతను చేసిన యత్నం అంత సీసీ కెమెరాలలో నమోదయిందన్నారు. ఆ వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

వర్మీ కంపోస్టును తయారు చేసుకోవాలి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ప్రతి రైతూ వర్మీకంపోస్టును తయారు చేసుకోవాలని కోవెలకుంట్ల ఎంపిడిఒ తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని పార్కు నందు తొట్టిలలో వర్మీ కంపోస్ట్ కోసం వానపాములను వదిలారు. వర్మీ కంపోస్ట్‌కు వానపాములను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సమాజంలో పురుషులు, స్త్రీలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో ట్రాన్స్ జెండర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్జెండర్లు మెరుగైన జీవితాన్ని అవలంభించేందుకు పురుషులు, స్త్రీలతో సమాన అవకాశాలు కల్పిస్తూ ఉపాధి మార్గాలు చూపిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 240 మంది పింఛన్ పొందుతున్నట్లు, వైద్య శాఖ నివేదికల్లో 690 మంది ఉన్నట్లు, ఎన్జీవో సంస్థలు వెయ్యి మంది ఉన్నట్లు రకరకాల గణాంకాలు చెప్తున్నారని, నిజమైన ట్రాన్స్జెండర్ల జాబితాను సమర్పించాలని సంబంధిత ఎన్జీవో సంస్థలకు సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఏ ఏరియాలో ఉన్నారు, ఎంతమందికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డులు ఉన్నాయి, ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, వారితోపాటు జీవిస్తున్న వ్యక్తులు తదితర వివరాలను వారం రోజుల్లో ఇవ్వాలని ఆదేశించారు. అందరికీ రేషన్, ఆధార్, ఓటర్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. పింఛన్ పొందుతున్న 240 మంది ట్రాన్స్ ట్రాంజెండర్లను 24 స్వయం సంఘాలుగా 15 రోజులలో ఏర్పాటు చేసి విధివిధానాలపై అవగాహన కల్పించాలని డిఆర్డిఏ పిడి, మెప్మా పీడీలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతనంగా మెడికల్ కళాశాల వచ్చిందని, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అప్గ్రేడ్ అయిన నేపథ్యంలో మెడికల్ బోర్డు ఏర్పాటుకు మూడు రోజుల్లో ఫైల్‌ను సర్క్యులేట్ చేయాలని డిఎంహెచ్ఒ, జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రత్యేక ఓపి బ్లాక్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతన పాలసీ ప్రకారం జిల్లాలోని ట్రాన్స్‌జెండర్‌లందరికీ గృహాలు కేటాయిస్తామన్నారు. సమావేశంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రైస్ ఫాతిమా, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఒ శారదాబాయి, సివిల్ సప్లైస్ అధికారి వెంకట్రాముడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్, ఎంప్లాయిమెంట్ అధికారి సోమ శివారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వైద్య రంగ పురోగతిలో అనస్థీషియా వైద్యులు కీలకం

- ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా ప్రజా అవగాహన కరపత్రాల విడుదల

ప్రజాశక్తి - నంద్యాల : ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా భారత జాతీయ అనస్థీషియా వైద్యుల సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అనస్థీషియా వైద్యుల సంఘం కార్యాలయంలో శస్త్ర చికిత్సలలో, అత్యవసర చికిత్స వార్డులలో అనస్థీషియా వైద్యుల పాత్ర గురించి అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. జాతీయ అనస్థీషియా వైద్యుల సంఘం నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ నాగరాజా రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ శేష ఫణి, కోశాధికారి డాక్టర్ మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి డాక్టర్ నాగరాజు పాల్గొని ప్రసంగించారు. 1846లో అక్టోబర్ 16న అమెరికాలోని మాసాచుసెట్స్ నగరంలో మార్టన్ మహాశయుడు ఈథర్ ఉపయోగించి దంత శస్త్ర చికిత్సను నొప్పి తెలియకుండా చేసిన రోజును ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అనస్థీషియా రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు శస్త్ర చికిత్సల పరిధిని విస్తృతం కావడానికి, వినూత్న శస్త్ర చికిత్సల ప్రక్రియలకు నాంది పలికిందన్నారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు మెదడు, గుండె, లివర్, కిడ్నీలకు చేయడానికి అనస్థీషియా రంగంలో వచ్చిన నూతన పరికరాలు, రోగి స్థితి గతులను నిరంతరం గమనించే పరికరాలు ఎంతో ఉపయోగకరంగా వున్నాయని అన్నారు. కార్యక్రమంలో అనస్థీషియా వైద్యులు మల్లీశ్వరి, మాధవి, రేచెల్, ప్రియదర్శిని, నియాజ్ పాల్గొన్నారు.

అనస్థీషియా పై ప్రజా అవగాహన కరపత్రాలు విడుదల చేస్తున్న నంద్యాల అనస్థీషియా వైద్యులు

టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -శ్రీశైలం ప్రాజెక్ట్

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చెంచు గిరిజన గూడెంలలోని గిరిజనులకు టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేయాలని కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై. ఆశీర్వాదం సంబంధిత అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల వలన గిరిజనులు ఇబ్బందులు పడుతన్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే యుద్ధ ప్రాతిపదికపై టార్పాలిన్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కుడుముల వెంకటేశం, ధంసాని వెంకటేశం, కొల్లమయ్య, భ్రమరాంబ, పార్వతి, వీరన్న, పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి - కొత్తపల్లి

వర్షాల పట్ల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఉమారాణి తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామ శివారులో ఉన్న ఎద్దులేరు వాగును ఆమె పరిశీలించారు. తహశీల్దార్ మాట్లాడుతూ వర్షాలు వస్తే మండలంలోని శివపురం సమీపంలో ఉన్న ఎద్దులేరు వాగు నీటి ఉధృతి వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈమె వెంట విఆర్ఓ బాబు మియా ఉన్నారు.

ఈ పంట సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల నందు ఖరీఫ్ ఈ పంట నమోదు చేసిన జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ వివరాలలో ఏమైనా అభ్యంతరాలు తెలిపినట్లైతే సరి చేస్తామన్నారు. ఈ నెల 18న తుది జాబితాను తయారు చేసి ప్రదర్శిస్తామన్నారు.

రైతు సేవ కేంద్రాల వద్ద ఈ పంట లిస్టులను పరిశీలిస్తున్న అధికారులు

18న విజయవాడలో కార్మిక సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విజయవాడలో అక్టోబర్ 18న నిర్వహిస్తున్న ఐఎఫ్‌టియూ రాష్ట్ర కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియు నగర అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, సురేష్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు గోకారి భవన్లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను వారు ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు రావి, బాబు, సమేలు, ఈశ్వర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

శకునాలలో పొలం పిలుస్తుంది

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఓర్వకల్లు మండలంలో బ్రాహ్మణపల్లె, శకునాల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొగాకు , కంది పంట పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ మధు, రైతు సేవా కేంద్ర సిబ్బందినగేష్, మోహన్ బాబు , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది , గ్రామ రైతులు పాల్గొన్నారు.

సూపరిన్‌టెన్‌డెంట్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి ఆదోని: ఆదోని ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ డివిజన్ కార్యాలయ సూపరిన్‌టెన్‌డెంట్ శేకప్ప గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు బుధవారం తెలిపారు. నలతగా, ఎదలో నొప్పిగా ఉందని తెలపగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స కై ఆసుపత్రిలో చేర్పించేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. పలువురు నివాళ్లు అర్పించారు.

కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న లైన్స్‌క్లబ్ కర్నూలు ప్రెసిండెంట్

లయన్స్ క్లబ్ సేవలను ముందుకు తీసుకెళ్తాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ముందుకు తీసుకెళుతుందని కర్నూలు ప్రెసిడెంట్ పి. శైలేంద్ర, కర్నూలు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రత్న ప్రసాద్ తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ వారు ఏర్పాటు చేసిన కంటి అద్దాలను మీసాల సుమలత ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ప్రెసిడెంట్ శ్రీశైలేంద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రత్న ప్రసాద్ లు మాట్లాడుతూ పేద ప్రజలకు తమ సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్తామని, కుట్టు మిషన్లు, బెడ్‌షీట్స్, కంటి అద్దాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలను చేస్తామన్నారు.

చిరు వ్యాపరులకు హ్యాకథాన్ అందుబాటులోకి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

చిరు వ్యాపారులకు హ్యాకథాన్ అందుబాటులోకి తెచ్చినట్లు అమెజాన్ ఇండియా సెల్లింగ్ పార్ట్‌నర్ సర్వీసెస్ డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ'ఇ-కామర్స్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందనీ తద్వారా చిన్న వ్యాపారాల అవసరాలు కూడా డిజిటలైజ్ అమలుతోపాటు విస్తరించాలని చూస్తున్నాయన్నారు. వ్యాపారవేత్తలకు వారి ప్రత్యేక సవాళ్లను పరిష్కరించే విధంగా రూపొందించిన పరిష్కారాలను అందించడానికి నిరంతరం ఆవిష్కరణలు చేయడం చాలా కీలకమన్నారు. అమెజాన్ సంభవ్ హ్యాకథాన్ దేశం అంతటా ఆవిష్కరణ అయిందని, వ్యవస్థాపకతను పెంపొందిస్తూ, వికసిత్ భారత్ ప్రధాన మంత్రి దార్శనికతకు అనుగుణంగా ఉందని చెప్పారు. చిన్న వ్యాపార యజమానులకు సరైన సాధనాలు, మద్దతును అందించడం ద్వారా, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు భారతదేశం ప్రయాణానికి తోడ్పడుతుండగా వారు అభివృద్ధి చెందడంలో సహాయ పడటానికి మేము కట్టుబడి ఉన్నామని అమిత్ నందా అన్నారు. హ్యాకథాన్‌కి ఈ నెల 14న దరఖాస్తులు తెరువబడ్డాయని, నవంబర్ 14న ఐడియా సమర్పణకు తుదిగడువని తెలిపారు. నవంబర్ 18న షార్ట్‌లిస్ట్ చేసిన ఆలోచనల ప్రకటన చేయబడుతుందన్నారు. నవంబర్ 24న ప్రోటోటైప్ సమర్పణ, డిసెంబర్ 5-6న వర్చువల్ డెమో డేస్ జరుగు తాయని వెల్లడించారు. డిసెంబర్ 10న అమెజాన్ సమ్భవ్ 2024లో విజేత ప్రకటన జరగనుంది. మరింత సమాచారం.. నమో దుకు https://bit.ly/Smbhav_Hackathon2024 సందర్శించాలని అమిత్ నందా కోరారు.

ఆయకట్టుకు నీరివ్వడంలో నిర్లక్ష్యం

- ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం : వి రాంభూపాల్
- అనంతలో 2వ రోజు 'సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్ర'

ప్రజాశక్తి-కళ్యానదుర్గం, ఉరవకొండ (అనంతపురం జిల్లా)

కరువు జిల్లా అనంతపురంలో ఆయకట్టుకు నీరివ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. అనంతపురం జిల్లాలో సాగునీటి కోసం సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర రెండో రోజు బుధవారం కళ్యాణదుర్గం, ఉరవకొండ, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో సాగునీటి కాలువలను నాయకులు పరిశీలించి ప్రజలు, రైతులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం పట్టణంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు అవకాశం ఉన్నా పాలకులు అటువైపు దృష్టి సారించకపోవడం విచాకరమని అన్నారు. ప్రభుత్వాలు, పాలకులకు ముందుచూపు లేకపోవడంతో పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని సక్రమంగా వాడుకుంటే జిల్లాలోని అన్ని చెరువులనూ నీటితో నింపొచ్చని తెలిపారు. ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసి హెచ్ఎల్‌సి ఎగువ కాలువకు నీరివ్వాలని, జీడిపల్లి నుంచి బిటిపి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

భైరవానితిప్ప ప్రాజెక్టుకు 4.90 టిఎంసిల కేటాయింపులున్నా నీరు రాని పరిస్థితి ఉందని తెలిపారు. భైరవానితిప్ప పరిధిలో కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి వెంటనే ప్రాజెక్టును పూర్తి స్థాయి నీటితో నింపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఉన్నారని, ఆయన స్పందించి ప్రాజెక్టుల అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కష్ణమూర్తి, నాగమణి, చంద్రశేఖర్, ఆయా మండలాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రామ్‌భూపాల్

కల్లూరు అడవికి చేరిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి- పీలేరు (అన్నమయ్య జిల్లా) : పీలేరు పరిసర ప్రాంత ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఏనుగుల గుంపు ఎట్టకేలకు కల్లూరు రక్షిత అటవీ ప్రాంతానికి చేరింది. పీలేరు మండలం కాకులారంపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీ సమీపంలోని యల్లెల రెడ్డప్పరెడ్డి మామిడి తోటలోకి సోమవారం రాత్రి ఏనుగుల గుంపు చేరుకుంది. ఈ విషయం తెలియని బందార్లపల్లి గ్రామానికి చెందిన రైతు, మాజీ ఉపసర్పంచ్ మోపిరెడ్డి చిన్న రాజారెడ్డి మంగళవారం ఉదయం మేత కోసం తన ఆవులను తోలుకుని పొలం వద్దకు వెళ్తుండగా ఓ ఏనుగు ఆయనను తన తొండంతో పట్టి దూరంగా విసిరి పడేసింది. దీంతో, చిన్న రాజారెడ్డి మృతి చెందారు. పగలంతా ఆ మామిడి తోటలోనే ఏనుగులు తిష్టవేశాయి.

18, 19న ఉప సర్పంచి, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ప్రజా ప్రతినిధులైన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు 2 రోజులపాటు పునశ్చరణ శిక్షణ, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ బుధవారం తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ నుండి ఉపసర్పంచ్, చురుకుగా ఉన్న ఇద్దరు వార్డు సభ్యులకు ఈనెల 18, 19వ తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో 2 రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీలలో సాధారణ కనీస పరిపాలన విధానము, ఏపీపీఆర్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు, గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ అండ్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామపంచాయతీ ఆస్తులు, వీధిదీపాలు విద్యుత్ బిల్లుల నిర్వహణ గ్రామ పంచాయతీలలో ఆర్థిక నిర్వహణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు తమ తమ గ్రామ పంచాయతీల నుండి ఉపసర్పంచ్ ఇద్దరు చురుకుగా, విషయాలను అవగాహన చేసుకోగల వార్డు సభ్యులను తప్పనిసరిగా మండల పరిషత్ కార్యాలయం నందు జరుగు 2 రోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. అదేవిధంగా శిక్షణకు హాజరయ్యే సభ్యులందరూ వారి ఆధార్ కార్డును, లింకు కాబడిన మొబైల్ నెంబర్ ను వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

రైతు సేవ కేంద్రాల్లో పంట నమోదు జాబితా

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచర్ల మండలంలోని పట్టణం, గ్రామాలలో గల రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో 2024 సంవత్సరం పంట నమోదు జాబితాలు మండలంలోని ఆయా గ్రామాల రైతు సేవ కేంద్రాలలో సరిచూసుకోవాలని బేతంచెర్ల మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ అన్నారు. గోరుమానకొండ గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో పంటల మోతి జాబితాను అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్ బుధవారం ప్రదర్శించారు. మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో రైతులు వేసుకున్న పంట నమోదు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రంలో సంబంధిత అధికారులతో సరి చేయించుకోవాలని అగ్రికల్చర్ ఆఫీసర్ అన్నారు.

అప్రమత్తంగా ఉండండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి : భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కలుగొట్లపల్లె గ్రామ సమీపంలోని వక్కిలేరు, భవనాసి వాగులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పాత మట్టి మిద్దెలలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కారదర్సులు వెంకటేశ్వర్లు, ఫైరోజ్‌లు పాల్గొన్నారు.